ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024 | 5



నేడు జిల్లా స్థాయి స్పందన

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందన ప్రజావిజ్ఞాపనల స్వీకార కార్యక్రమం ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్‌లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు.

మరిన్ని విషయాలు.. వెలుగులోకి..

- రూ.4కోట్లకు పైగానే మోసం
- విస్మయం కలిగిస్తున్న నకిలీ రుణ వ్యవహారం
- నిబంధనలు పాటించకుండానే రుణాల మంజూరు
- బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది పాత్రపై అనుమానాలు
- మేనేజరు మారిన తర్వాతే బయటకు..



రుణాలు మంజూరు చేసిన పిఠాపురంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 25: బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి వారి పేరున రుణాలు తీసుకుని కొంత సొమ్ము ముట్టచెప్పి టోకరా వేసిన సంఘటనలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత ఈవ్యవహారం కోటి రూపాయిల వరకూ ఉంటుందని భావించినా ఇది రూ.4కోట్లకు పైగా ఉంటుందని, బాధితులు 400మంది వరకూ ఉండవచ్చునని చెబుతున్నారు. ఇందులో బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది, ఒకరిద్దరు బయట వ్యక్తులు కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన బందిన భవానీ, లోడా పద్మ, కమ్మర గన్ని, బందిలి నాగరత్నం, చిన్నం అన్నవరం, మంగం వసంత, కుంచే ముని, సత్యవతి, చిన్నం నాగేశ్వరీ, కుంచే సత్యవతి, సంధ్య పిఠాపురం పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణాలు ఇప్పిస్తానని చెప్పి వారివద్ద రుణపత్రాలపై సంతకాలు, వారి ఆధార్, రేషన్‌కార్డులు తీసుకుని రుణాలు మంజూరు చేయించి రూ.2లక్షలకుగాను రూ.50వేలు మాత్రమే ముట్టచెప్పి మిగిలిన మొత్తాన్ని చిన్నం అన్నవరం, కాకినాడకు చెందిన చిన్ని అనే మహిళ తీసుకుని మోసం చేసిన సంఘటనపై వారు కలెక్టరు, ఎస్పీలను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. బ్యాంకు అధికారులు రుణాలు వసూళ్లకు రావడంతో ఈ వ్యవహారం వెలుగు చూసి ప్రశ్నించగా చిన్ని తమపై దాడి చేయించేందుకు ప్రయత్నించిందని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు, వెలుగు ఉన్నతాధికారులు జరుపుతున్న విచారణలో పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ వ్యవహారంలో 400మంది మహిళలు రూ.4నుంచి రూ.5కోట్ల మేర మోసపోయినట్లు వారి పరిశీలనలో గుర్తించినట్లు తెలిసింది. రుణాలు మంజూరులో బ్యాంకు అధికారులు నిబంధనలకు నీళ్లు వదలడమేగాక, చిన్ని అనే మహిళ చెప్పిన మేరకే రుణాలు ఇచ్చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బ్యాంకు మేనేజరు మారిన తర్వాతే ఈ వ్యవహారం బయటకు రావడం ఇందుకు బలం చేకూరుతోంది.

రుణాలు మంజూరు ఇలా చేయాలి

మహిళలు గ్రూపుగా ఏర్పడి రుణం పొందేందుకు వెలుగు(డీఆర్డీఏ) నుంచి సదరు సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ ప్రింట్‌ను బ్యాంకు అధికారులకు అందించాలి. సభ్యులు ఏ వ్యాపారం చేయడానికి ఆసక్తి చూపుతున్నారో మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను వెలుగు సిబ్బంది సిద్ధం చేయాల్సి ఉంటుంది. అనంతరం సంఘంగా ఏర్పడిన సభ్యుల తీర్మానం తీసుకుని దాన్ని కమ్యూనిటీ ఆర్గనైజర్ నిర్ధారించిన తర్వాత వాటిని బ్యాంకుకు అందిస్తారు. సభ్యులందరూ అదే మండలానికి చెందిన వారై ఉండాలి. సంఘం ఏర్పడిన తర్వాత ఆరునెలలు వరుసగా సభ్యులు పొదుపు చేసిన తర్వాత రుణం పొందాల్సి ఉంటుంది. అనంతరం వెలుగు అధికారుల సూచనల మేరకు బ్యాంకు అధికారులు తొలుత రూ.50వేలు నుంచి లక్ష వరకూ సంఘ సభ్యులందరికి కలిసి రుణాలు ఇవ్వాలి. అది సక్రమంగా చెల్లిస్తే రుణ పరిమితిని పెంచుకుంటూ వెళ్లాలి.

ఇక్కడ అంతా రివర్స్

మోసపోయిన బాధితులకు రుణాలు మంజూరు వ్యవహారంలో ఇందులో ఒక్క నిబంధన కూడా పాటించలేదు. వేర్వేరు మండలాలకు చెందిన వారిని సభ్యులుగా సంఘాన్ని ఏర్పాటు చేసేశారు. సంఘం ఏర్పడిన తర్వాత ఒక్కొక్క సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకూ సంఘం అంతటికి కలిపి రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకూ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యాయి. సంఘాలకు రుణాలు ఇచ్చిన వ్యవహారం తమకు తెలియకుండానే జరిగిందని వెలుగు అధికారులు చెబుతున్నా ఇందులో కొందరు యానిమేటర్లు పాత్ర ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుణాలు పొందినట్లు చెబుతున్న వారిలో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, కాకినాడ రూరల్ తదితర మండలాలకు చెందిన వారు ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు పాటించకుండా ఒకే సారి భారీగా రుణాలు మంజూరు చేయడం విస్మయం కలిగిస్తోంది.

వెలుగు చూసిందిలా..

2019 నుంచి పిఠాపురం బ్యాంకు ఆఫ్ బరోడా ద్వారా రుణాలు పొందిన సంఘాలు 40 మహిళాశక్తి సంఘాలు రుణాలు సక్రమంగా చెల్లించడం లేదని బ్యాంకు అధికారులనుంచి వెలుగు అధికారులకు సమాచారం వచ్చింది. రుణాలు ఇచ్చిన సమయంలో మేనేజరుగా పనిచేసిన వ్యక్తి బదిలీ అయి కొత్త మేనేజరు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్‌పీఏలుగా మారిన మహిళా సంఘాల రుణాలపై దృష్టి సారించడంతో పాటు రుణ మంజూరు పత్రాల్లోని చిరునామాల ఆధారంగా వారి వద్దకు వెళ్లడంతో అసలు విషయం వెలుగుచూసింది. 40 సంఘాల్లో మూడు సంఘాలు మాత్రమే సక్రమంగా రుణాలు చెల్లిస్తుండగా 37సంఘాలు ఇప్పటివరకూ రుణవాయిదాలు చెల్లించలేదు. రుణాలు చెల్లించకపోయినా గత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇందులో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాత్ర, వీరికి వెలుగు నుంచి ఏయే అధికారులు, సిబ్బంది సహకరించారనే విషయాలు తేలాలి.

రుణాలు చెల్లిస్తున్నా...

బ్యాంకునుంచి తమ పేరుపై రూ.2లక్షల వంతున రుణం తీసుకుని రూ.50వేలు మాత్రమే ఇచ్చిందని, తాము రుణం తీసుకున్నప్పటినుంచి ప్రతినెలా తమకు లోన్‌లు ఇప్పించిన చిన్ని అనే వ్యక్తికి వాయిదాలు చెల్లిస్తున్నామని బాధిత మహిళలు చెబుతున్నారు. రుణంలో 25శాతమే తమకు ఇచ్చి మోసం చేయడమేగాక వాయిదా సొమ్ములను చిన్ని స్వాహా చేసిందని వారు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రూ.4కోట్లకు పైగా గోల్‌మాల్ జరిగిందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రాథమిక విచారణ మాత్రమే చేస్తున్నామని, వెలుగు, బ్యాంకు అధికారులు, సిబ్బంది నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ఇది మరింత పెరిగే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు. బ్యాంకు రుణాలు ఎలా మంజూరు చేశారు, తీర్మానాల్లో సంతకాలు అసలువేనా, రుణ మొత్తాలను ఒకే వ్యక్తికి ఎలా నగదుగా ఇచ్చేశారు, ఇందులో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాత్ర ఏంటి, రుణాలు పొందిన సంఘాల వివరాలు ఇన్నేళ్లు పరిశీలించకుండా వెలుగు అధికారులు ఎందుకున్నారు, ఇందులో వారి సిబ్బంది పాత్ర ఎంతవరకూ ఉంది, రుణపత్రాలపై ఎవరు సంతకాలు చేశారు తదితర విషయాలు పోలీసులు పరిశీలిస్తున్నారు.


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గ్రూప్-2 పరీక్షలు రాసి వస్తున్న అభ్యర్థులు

జిల్లాలో ప్రశాంతంగా.. గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు

- 52 కేంద్రాల్లో నిర్వహణ
- 86శాతం మంది అభ్యర్థులు హాజరు
- పరీక్ష రాసిన 20,951మంది అభ్యర్థులు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 25: గ్రూప్-2 ఉద్యోగాల నియామకంకోసం జిల్లాలోని 52కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు ఏ ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 24,489మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 20,951మంది మాత్రమే హాజరయ్యారని 3,538 మంది అభ్యర్థులు పరీక్ష రాయలేదన్నారు. 86శాతం మంది అభ్యర్థులు హాజరుకాగా పరీక్షలను అధికారులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్‌లు పర్యవేక్షించాయన్నారు.

100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి జాతికి అంకితం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 25: కాకినాడలో రూ.114కోట్లతో నిర్మించిన 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ గీత

కులాలు, మతాలు, జాతుల మధ్య చిచ్చు పెట్టడం ద్వారంపూడికి పరిపాటి

- మత్స్యకార జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే కొండబాబు ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: తన స్వార్థం కోసం కులాలు, మతాలు, జాతుల మధ్య చిచ్చు పెట్టడం, అధికారం కోసం ఎంతటికైనా దిగజారడం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి పరిపాటిగా మారిందని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రశాంత నగరం కాకినాడలో కులాలు, మతాలు, జాతుల మధ్య ఘర్షణలు సృష్టించి లబ్ధి పొందడానికి ద్వారంపూడి కుట్ర రాజకీయాలు చేస్తున్నాడన్నారు. మత్స్యకార జాతిని కించపరుస్తూ ద్వారంపూడి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ఆయన మత్స్యకార జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో మాజీ చైర్మన్ బీరక చంద్రశేఖర్‌పై దాడి చేసి ఘర్షణలు సృష్టించాడని, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌పై బహిరంగంగా అసభ్య పదజాలంతో దూషణలు చేశాడన్నారు. దీనిపై జనసైనికులు ప్రశాంతంగా నిరసన చేపడితే వారిపై కర్రలతో, రాళ్లతో దాడి చేయించాడన్నారు. అన్ని కులాలవారు ఓట్లు వేస్తేనే అధికారంలోకి వచ్చామనే విషయాన్ని ద్వారంపూడి మరిచిపోయి నేడు మత్స్యకార జాతిని దూషించి నగరంలో ఘర్షణలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. ఎదుటి వారిని హేళన చేస్తూ నాలుకలు కోస్తా, పళ్లు రాలగొడతా, లారీలతో తొక్కించేస్తా.. అంటూ మాట్లాడడం ద్వారంపూడికి అలవాటైపోయిందన్నారు. సభ్యత సంస్కారం ఉంది కాబట్టే తాము అటువంటి వ్యాఖ్యలు చేయలేకపోతున్నామన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న దోపిడీ శేఖర్ ఐదేళ్లుగా అధికారంలో ఉండి నేటివరకు ఎందుకు నిరూపించలేకపోయాడని ప్రశ్నించారు. నగర ప్రతిష్ఠను దిగజారుస్తున్న ద్వారంపూడిని కాకినాడ నుంచి తరిమికొట్టేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, గదుల సాయిబాబు, దండప్రోలు నాగబాబు, సుంకర దొరబాబు, గుత్తుల మంగరాజు పాల్గొన్నారు.

ఆసరా ఇంకెప్పుడు?

- నేటికీ పూర్తిస్థాయిలో జమ కాని నిధులు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న మహిళలు


ఇటీవల నమూనా ఆసరా చెక్కును అందజేస్తున్న దృశ్యం

తుని రూరల్, ఫిబ్రవరి 25: ఎన్నికలు సమీపిస్తుండడంతో పథకాల పేరుతో వైసీపీ పాలకులు ప్రచారాన్ని మార్మోగిస్తున్నారు. ఇటీవల పథకాలకు సంబంధించి ముఖ్యమంత్రి ఏ బటన్ నొక్కినా నగదు సకాలంలో ఖాతాల్లోకి జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఖాతాల్లోకి నగదు పడాలంటే నెలలు తరబడి వేచి చూడాల్సి వస్తోందని అంటున్నారు. ఇటీవల వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మఒడి పథకాలకు సంబంధించి సీఎం జగన్ బటన్ నొక్కినా నెలపైనే సమయం పట్టిందంటున్నారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 2019 ఏప్రిల్ 11 ముందు బ్యాంక్ లింకేజీ అప్పును ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. 4వవిడత నిధులను అక్టోబరులోనే ఖాతాల్లోకి జమచేయాలి. కానీ ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఎట్టకేలకు సీఎం జగన్ జనవరి 23న అనంతపురంలో బటన్ నొక్కారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికీ నగదు పడలేదని పొదుపు సంఘాల సభ్యులు వాపోతున్నారు

ఉత్సవాలు అంటూ హడావుడి

4వ విడత రుణమాఫీ అమలును ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని యోచనతో ఆసరా ఉత్సవాలు అన్ని ప్రాంతాల్లో ఆర్భాటంగా అందించి నమూనా చెక్కును అందజేశారు. ఈ సమావేశాలకు లబ్ధిదారులకు తప్పనిసరిగా హాజరయ్యేలా క్షేత్ర సిబ్బందికి లక్ష్యాలు విధిస్తున్నారు. ఈ సభకు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై ఉపన్యాసాలతో ఊదరగొడుతున్నారు. ప్రాంతాలవారీగా నిర్వహిస్తున్న ఈ సభలు అనంతరం సొమ్ము జమ అవుతుందని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వారాలు గడుస్తున్నా నగదు జాప్యంపై లబ్ధిదారులు అసహనానికి గురవుతున్నారు.

60శాతమేనట..

చివరి విడతలో భాగంగా తుని నియోజకవర్గంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో 4339 సంఘాల్లో 43390మంది సభ్యులు ఉన్నారు. వీరికి రూ.36.33కోట్లు రావాల్సి ఉంది. నేటికి చాలా సంఘాలకు పూర్తిస్థాయిలో నగదు రాలేదు. ఇప్పటికే 60శాతం నిధులు సంబంధిత సంఘాల ఖాతాలకు జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఖాతాల్లో నగదు పడితే సంఘాలు నేరుగా తీసుకోవచ్చు. ఆసరా పథకం కింద డబ్బులు వస్తే అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు కానీ తీసుకునే అవకాశం లేదు. గ్రూపులు తీర్మానం జరిగాక బ్యాంకులు పిలిచినప్పుడే వెళ్లాలి. పొదుపు వివరాలు, తీర్మానం, ఆసరా నిధుల వివరాలు సంబంధిత వివరాలు బ్యాంకు అధికారులకు తెలియజేయాలి. ఈ వ్యవహారం అంతా సకాలంలో జరుగుతాదా లేదో తెలియని పరిస్థితి.

దళితులకు ద్రోహం చేసిన వైసీపీకి బుద్ధి చెబుదాం

- నేరం చేసిన వాళ్లు బయట తిరుగుతున్నారు
- బాధితులపై అక్రమ కేసులు
- 'భారత రాజ్యాంగమే దళితుల అజెండా' అనే అంశంపై సమావేశంలో దళిత నాయకులు


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న దళిత సంఘాల రాష్ట్ర, జాతీయ నాయకులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి25: 'ఎస్సీఓట్లతో అధికారం చేపట్టిన వైసీపీ నేరచరిత్ర కలిగిన నాయకులకు కొమ్ము కాస్తోంది. హత్యలు చేసి డోర్ డెలివరీ చేసిన బాధితులు, శిరోముండనం కేసులో ఏళ్లు గడుస్తుండగా బాధితులు చనిపోయిన వారికి న్యాయం జరగని పరిస్థితి చూస్తున్నాం. దళితులకు ద్రోహం చేసిన వైసీపీకి బుద్ధి చెబుదాం. భారత రాజ్యాంగమే దళితుల అజెండా..' అంటూ సభలో వక్తలు మాట్లాడారు. కాకినాడలోని సూర్యకళా మందిరంలో ఆదివారం సాయంత్రం ఆంధ్రా మాలమహానాడు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగమే దళితుల అజెండా అనే అంశంపై సభను నిర్వహించారు. దీనికి ఆంధ్రా మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, ఎంఏకే భీమారావు, తెలంగాణా మాలమహానాడు అధ్యక్షుడు బత్తు లింగ హాజరయ్యారు. అందరికీ ఇచ్చే పథకాలు తప్ప రాష్ట్రంలో ఎస్సీలకు ప్రత్యేకంగా ఏమీ అమలు చేయలేదన్నారు. 1.30లక్షల కోట్ల ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. వెంకటరాయపురం శిరోముండనం కేసు 25ఏళ్లుగా తేలకపోవడం దారుణమన్నారు. కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బయట తిరుగుతుంటే బాధితులు కేసు తేలేలోపు ఒక్కొక్కరుగా మృతి చెందుతున్నారని వాపోయారు. దళిత యువకుడిని హతమార్చి డోర్ డెలివరీ చేసిన మరో ఎమ్మెల్సీ అనంతబాబును సీఎం తన పక్కన పెట్టుకుని తిప్పుకుంటున్నారన్నారు. రద్దుచేసిన ఎస్సీ పథకాలన్నీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి లింగు శివప్రసాద్, సీనియర్ జర్నలిస్టు మూర్తినగేష్, జైభీమ్‌ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి శివ, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ సమన్వయకర్త తోటి చెంగలరావు పాల్గొన్నారు.

నీటి కోసం నిరసన

- 2వేల ఎకరాలకు సాగునీరందక రైతుల ఆక్రందన
- కిర్లంపూడిలో ఏలేరు ఇరిగేషన్ సెక్షన్ ఆఫీస్‌కు తాళాలు
- కార్యాలయంలో ఫర్నీచర్ బయట పడేసి ఆందోళన


కిర్లంపూడిలో ఇరిగేషన్ కార్యాలయానికి తాళాలు వేసి ఫర్నీచర్ బయట పడేసిన రైతులు

కిర్లంపూడి, ఫిబ్రవరి 25: కిర్లంపూడిలో ఏలేరు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంవద్ద రైతులు పంటలకు నీరు అందకపోవడంతో ఆగ్రహించి కార్యాలయానికి ఆదివారం తాళాలు వేశారు. పిఠాపురం మండలంలోని పి.దొంతమూరు గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రమణ బాబ్జి, పి.రాయవరం సర్పంచ్ మాదేపల్లి వెంకటేశ్వరరావు, పి.తిమ్మాపురం సర్పంచ్ పైలా సన్యాసినాయుడు, మాదేపల్లి విజయభాస్కరరావు సహా పలువురు రైతులు కిర్లంపూడి ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. ముందుగా ఆఫీసులో ఉన్న ఇరిగేషన్ అధికారులను బయటకు పంపించి కుర్చీలు, బల్లలు బయట పడేసి కార్యాలయానికి తాళం వేశారు. అక్కడే కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటు చేసి రైతులందరూ ఎండిపోయిన నారు మొక్కలను చూపుతూ నిరసన తెలిపారు. ఇరిగేషన్ ఈఈ రైతులకు నీరు వందలకుండా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అక్కడే వంటావార్పు చేశారు. విషయం తెలుసుకున్న డీఈ శ్రీనివాస్, జేఈ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడించడంతో 2వేల ఎకరాలకు నీరు అందక వేసిన పంట పూర్తిగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజుల్లో పూర్తిస్థాయిలో పంటలకు నీరు అందిస్తామని తెలపడంతో వారు నిరసన విరమించారు. నిరసన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సాగునీరు ఇవ్వకపోవడంపై వర్మ వినూత్న నిరసన


రమణక్కపేటలో వరిచేలో పడుకుని నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, ఫిబ్రవరి 25: రబీలో వరి పంటలకు సాగు నీరందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెట్టినా, నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, తక్షణమే పూర్తిస్థాయిలో నీరు ఇవ్వకపోతే ఆందోళన చేస్తానని మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. కొత్తపల్లి మండలంలో సాగునీరందడం లేదన్న రైతుల ఫిర్యాదుపై ఆదివారం రమణక్కపేటలో వరిపొలాలను పరిశీలించారు. ఎండిన వరిచేలో పడుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఇరిగేషన్ సమావేశంలో రబీపంటకు సాగునీరిస్తామని చెప్పి సాగునీరందించలేని స్థితిలో ప్రభుత్వ అధికారులు ఉన్నారని విమర్శించారు. ఒక్క రమణయ్యపేటలోనే 700 ఎకరాల వరిపంటకు నీరు లేక నెరలిచ్చి ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రూ.30వేల నుంచి రూ.40వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారన్నారు. పిఠాపురం మండలం గొర్రిఖండి అవతల, గొల్లప్రోలు మండలం మల్లవరం గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. టీడీపీ హయాంలో రెండు పంటలు సాగు చేసేలా చంద్రబాబు సాగునీరందించారన్నారు. పురుషోత్తపట్నం ప్రాజెక్టు ఇచ్చినా దీనికి కరెంటు బిల్లు కట్టలేక పక్కన పెట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అసలే రైతులకు సాగునీరు సరఫరా చేయలేని పరిస్థితులు ఉంటే స్థానిక ఎమ్మెల్యే దొరబాబు, ఎంపీ వంగా గీత తాండవకు మూడు టీఎంసీల నీటిని ధారాదత్తం చేశారని ఆరోపించారు. నీరివ్వాలంటే ఎకరాకు కొంత చొప్పున వైసీపీ నాయకులకు లంచం ఇవ్వాల్సి ఉందని రైతులు చెబుతున్నారన్నారు. 30వేల ఎకరాలకు ఒక పంటకు రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల ఆదాయం వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. నీటిపారుదల, నిర్వహణపై సరైన ప్రణాళిక లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రమణక్కపేట గ్రామంతోపాటు చుట్టుపక్కల శివారు గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేయాలని లేదంటే రైతులతో కలసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని తెప్పోత్సవం



పుష్పక వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

- ముగిసిన అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు
- చివరి రోజు హంస వాహనంపై విహరించిన స్వామివారు
- ఘనంగా శ్రీపుష్పోత్సవం



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

అంతర్వేది, ఫిబ్రవరి 25: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం స్వామివారిని పుష్పక వాహనంపై ఊరేగించారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగించి అనంతరం దేవస్థానం చెరువుగట్టు వద్దకు తీసుకువచ్చారు. తొలుత అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చెరువులో ఉన్న హంస వాహనంపై కొలువుదీర్చి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెప్పోత్సవ నిర్వహణ విరాళ దాత గొట్టిముక్కల భీమరాజు, ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజా బహుద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి తిరుమంజనములు, దర్పణ సేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పయాగోత్సవం, చెంగోళ విన్నపం, తీర్థగోష్ఠి నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి పవళింపు సేవతో తీర్థ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.



పుష్పోత్సవం నిర్వహించిన దృశ్యం

ఘనంగా శ్రీపుష్పోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన స్వామివారి శ్రీపుష్పోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి ఆలయంలో అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వాదశ తిరువరాధన పూజా కార్య క్రమాలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో స్వామివారికి ఘనంగా శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, అనంతరం శ్రీస్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్య నారాయణ, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం

భీమేశ్వర స్వామివారి తెప్పోత్సవం



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు



ద్రాక్షారామ, ఫిబ్రవరి 6: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భీమేశ్వర స్వామి వారి తెప్పోత్సవం సప్తగోదావరి నదిలో నయన మనోహరంగా జరిగింది. రాత్రి 7.05 గంటలకు కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వార్లను మంగళ వాయిద్యాల నడుమ సప్తగోదావరిలో విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకృతమైన హంస వాహనం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం కల్యాణమూర్తులను హంసవాహనంపై కల్యాణ బ్రహ్మలు అధిష్ఠింపజేశారు. వేద పండితులు బులుసు రామకృష్ణ బృందం ముందుగా స్వామివారికి ఆస్థాన పూజ జరిపారు. అనంతరం కల్యాణ మూర్తులకు నీరాజన మంత్ర పుష్పములు సమర్పిస్తుండగా మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారు సప్తగోదావరి నదిలో జలవిహారం చేశారు. భీమేశ్వరుని జలవిహారం సప్తగోదావరి ఒడ్డుకు చేరుకోగా భక్తులు తన్మయత్వంతో తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని రథోత్సవం



అన్నవరం, ఫిబ్రవరి 25: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మాఘపు ఆదివారం పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. అయితే ప్రతి ఆదివారం రథోత్సవం నిర్వహించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దీనిని ఆర్జిత సేవగా పెట్టాలని భావిస్తున్నారు. వచ్చే నెలలో జరిగే పాలక మండలి సమావేశంలో దీనిపై చర్చించి దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో తుది చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.

భావనారాయణస్వామి ఆలయం కిటకిట

మాఘ ఆదివారం కావడంతో పోటెత్తిన భక్తజనం



ఆలయంలో పాలపొంగులు సమర్పిస్తున్న భక్తులు



ఆలయానికి పోటెత్తిన భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 25: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మాఘమాస తిరునాళ్లు వైభవోపేతంగా సాగుతున్నాయి. మాఘమాస మహోత్సవాల్లో భాగంగా మూడో ఆదివారంతో పాటు భావనారాయణస్వామి జన్మదినం కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల తాకిడిని దృష్టిని ఉంచుకుని ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావు ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి, స్వామివారిని మేలుకొల్పిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతించారు. భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఆలయ ప్రాంగణంలో ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరమాన్నం, పాలపొంగులు తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. స్వామివారి జన్మదినం కావడంతో తిరునాళ్లలో సుమారు 45 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో భీమశంకరరావు తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు స్వామివారిని దర్శించుకుని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చక్రధర్, వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

లోవలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, ఫిబ్రవరి 25: తలుపులమ్మ లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే భక్తులు తరలివచ్చారు. లోవకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతో ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన షెడ్‌లతో పాటు వసతి గృహాల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తుల రద్దీని పర్యవేక్షించారు. వివిధ విభాగాల ద్వారా రూ.3.09 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హోరాహోరీగా..

సామర్లకోటలో ఖోఖో పోటీలు



ఖోఖో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 25: కాకినాడ జిల్లా సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో 56వ అంతర్ జిల్లాల ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య ఆదివారం హోరాహోరీగా జరిగాయి. ఖోఖో పోటీల నిర్వాహకులు కె.పట్టాభిరామం, ఊబా జాన్ మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో విశాఖ-గుంటూరు మధ్య జరిగిన పోటీలలో 10-3 స్కోరు తేడాతో విశాఖ విజయం సాధించింది. కృష్ణా-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో 9-1 స్కోర్ తేడాతో కృష్ణా జట్టు విజయం సాధించింది. ప్రకాశం-కర్నూలు మధ్య జరిగిన పోటీలో 15-3 పాయింట్ల తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి జిల్లా-పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి జట్టు 5-3 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కడప- అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీలో కడప జట్టు విజయం సాధించింది. విశాఖ-నెల్లూరు మధ్య జరిగిన పోటీలో నెల్లూరు జట్టు 5-9 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కృష్ణా- చిత్తూరు మధ్య జరిగిన పోటీలో కృష్ణ జట్టు 11-4 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ప్రకాశం-విజయనగరం జట్ల మధ్య జరిగిన పోటీలో ప్రకాశం జట్టు 13-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలను తిలకించేందుకు ప్రముఖులు, పలువురు క్రీడాకారులు హాజరయ్యారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాల పవర్‌లిఫ్టింగ్ పోటీలు



స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా నిలిచిన శ్రేయకు ట్రోఫీ బహూకరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: అమలాపురం 2వ వార్డులోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్-2024 పోటీలు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబుల నేతృత్వంలో జరిగాయి. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా ఎం.శ్రేయ(తణుకు), స్ట్రాంగ్ ఉమెన్స్ రన్నర్‌గా పి.వందన(అమలాపురం)లు నిలిచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. పవర్‌లిఫ్టింగ్ బార్‌ను ఎత్తి పోటీలు ప్రారంభించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 96 మంది వెయిట్ లిఫ్టర్లు హాజరయ్యారు. 9 విభాగాల్లో పోటీలు జరిగాయి. తొలుత మహిళా విభాగంలో నిర్వహించిన పోటీల విజేతల వివరాలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు ప్రకటించారు. 66 కిలోల మహిళా విభాగంలో జి.సుభద్ర (మలికిపురం) ప్రథమ, యు.శశికళ (అమలాపురం) ద్వితీయ, ఎం.దుర్గ (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. 66 కిలోలు పైబడిన విభాగంలో ఎం.శ్రేయ (తణుకు), పి.వందన (అమలాపురం), సీహెచ్ హారిక (రామచంద్రపురం) వరుస స్థానాల్లో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా డీవీవీ సత్యనారాయణ, యు.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), దొమ్మేటి వెంకటరమణ, ఎంవీ సముద్రం(అమలాపురం) వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, డాక్టర్ గంధం విశ్వనాథ్, కౌన్సిలర్లు ఆశెట్టి నాగదుర్గ, యేడిద శ్రీను, కల్వకొలను బాబి, ఆశెట్టి ఆదిబాబు, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్వకొలను తాతాజీ, యెండూరి నాగేశ్వరరావు, తరెట్ల రాజేష్ తదితరులు విజేతలకు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతన కమిటీతో నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: ఏపీజేఏసీ అమరావతి సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం కాకినాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలకు అసిస్టెంట్ రిజిస్ట్రారు, కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు స్వీకరించగా గడువు ముగిసే సమయానికి తొమ్మిది పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యాయి. దీంతో ఉమ్మడి జిల్లా సంఘ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడిగా సవరపు చినపాపారావు (కరప ఎంఆర్‌వో ఆఫీస్), సహాధ్యక్షుడిగా వాసంశెట్టి దుర్గాప్రసాద్(కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీస్), ఉపాధ్యక్షులుగా ధర్మవరపు శ్రీనివాసరావు (అమలాపురం సివిల్ సప్లయిస్ ఆఫీస్), బాలిబోయిన గణేశ్వరరావు (పెద్దాపురం ఆర్‌డీవో ఆఫీస్), కార్యదర్శిగా ఖండవల్లి చంద్రశేఖర్ (మామిడికుదురు బాయ్స్ హాస్టల్), సంయుక్త కార్యదర్శులుగా మానుపాటి వరలక్ష్మి (అమలాపురం ఆర్‌డీవో ఆఫీసు), తోటకూర శ్రీనివాస్ (రామచంద్రపురం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొరవాడ దుర్గాప్రసాద్ (కాకినాడ ఎంప్లాయిమెంట్ ఆఫీస్), కోశాధికారిగా కొప్పిశెట్టి కృష్ణ (కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ నిబంధనల ప్రకారం నూతనంగా ఎన్నికైన కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు, కార్యదర్శి ఎన్ఎస్‌కే దుర్గాప్రసాద్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యవర్గం మూడేళ్ల కాలం పాటు కొనసాగుతుందని సంఘం ప్రతినిధులు తెలిపారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్సీ కవిత



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

పి.గన్నవరం, ఫిబ్రవరి 25: ముంగండ శ్రీముత్యాలమ్మవారి దయతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ప్రగతిపథంలో ముందుకు సాగే విధంగా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె విచ్చేశారు. కవితకు నన్నయ యునివర్సిటీ న్యాయాధికారి నందెపు నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మీతో కలిసి పూజలు నిర్వహించారు. అదే విధంగా అయినవిల్లి విఘ్నేశ్వరుడు, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రపటాలు, ప్రసాదాలను కవితకు అందించారు. అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు కొమ్ముల సూరిబాబు అప్పనపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి చిత్రపటం, స్వామివారి ప్రసాదం అందించారు. ఆలయ అర్చకులు సోమయాజులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు.

సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధికి నేడు శ్రీకారం



సామర్లకోట, ఫిబ్రవరి 25: కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను రూ.25.37 కోట్లతో చేపట్టనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టనున్న అమృత్‌భారత్ స్టేషన్ పథకం పనులను జాతికి అంకితం చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్‌లో పథకంలో సామర్లకోట రైల్వే స్టేషన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారని సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు. ఈ నిధులతో సామర్లకోట స్టేషన్ ప్లాట్‌ఫాం విస్తరణ, అభివృద్ధి, ప్లాట్‌ఫాంల సుందరీకరణ పనులు, టాయ్‌లెట్స్ అభి వృద్ధి పనులు, వెయిటింగ్ హాలు అభివృద్ధి, రెండో ఎస్కలేటర్, స్టేషన్ విద్యుద్దీకరణ, స్టేషన్ ఆవరణ బ్యూటిఫికేషన్ పనులను చేపట్టనున్నట్లు సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు రానున్న కొత్త కళ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ రైల్వే స్టేషనుగా రాజమండ్రి రైల్వే స్టేషను మెరుగుపడనుంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం దేశ వ్యాప్తంగా ఎంపికైన స్టేషన్ల కోసం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని సామర్లకోట, అనపర్తి, రాజమండ్రి ఉన్నాయి. ప్రజలు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాన్ని తిలకించడానికి వీలుగా రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్క్రీన్లు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలకు వేదిక తదితర ఏర్పాట్లను ఒకటో ప్లాట్‌ఫాం చివరన రైల్వే అధికారులు పూర్తి చేశారు. నిబంధనలను అనుసరించి ఇప్పటికే ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వి.కల్యాణ్‌కుమార్‌ని రైల్వే నియమించింది. ఉదయం 10.30 గంటల నుంచే వివిధ కార్యక్రమాలు ప్రారంభం కాగా 12.30 గంటల సమయంలో ప్రధాని వర్చువల్ విధానంలో శంకుస్థాపన నిర్వహిస్తారు. అమృత్ భారత్ స్టేషన్‌గా చేసే అభివృద్ధిలో భాగంగా ఇప్పుడు ఉన్న రైల్వే స్టేషను రూపు రేఖలను రూ.214 కోట్లతో పూర్తిగా మార్చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పిస్తారు. అయితే ప్రయాణికుల రాకపోకల రీత్యా కీలకమైన ఆరో ప్లాట్‌ఫాం నిర్మాణంపై స్పష్టత లేదు. అలాగే ఇదే కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరిలోని లక్ష్మీపురం-ఎన్‌హెచ్ 16 (తుని రైల్వేస్టేషను సమీపంలో), మాదాపురం-పిఠాపురం, గొర్స-పిఠాపురం (పిఠాపురం), చేపూరు-ఎన్‌హెచ్16 (హంసవరం), కాల్దరి-వేలివెన్ను, వేలివెన్ను-శెట్టిపేట(కాల్దరి), శెట్టిపేట గ్రామంలో(నిడదవోలు)ని రైల్ అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా ప్రధాని మోదీ జాతికి అంకితం చేస్తారు.

హాకీ మహిళా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టు సభ్యులు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 25; మార్చి 8 నుంచి 19 వరకు ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగే అంతర్ జిల్లాల మహిళా హాకీ పోటీలకు ఆదివారం ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక జిల్లా క్రీడా మైదానంలో జరిగింది. 32మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు వి.రవిరాజు, నాగేంద్రకుమార్, సభ్యులు రాజారమేష్, కిరణ్ పాల్గొన్నారు.

ముగిసిన కుంతీమాధవుని కల్యాణోత్సవాలు

పిఠాపురం, ఫిబ్రవరి 25: పట్టణంలోని కుంతీమాధవస్వామి దివ్య కల్యాణమహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 8రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున స్వామికి పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు జరిగాయి. రాత్రి స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం నిర్వహించారు. మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవ భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

'రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి'

కరప, ఫిబ్రవరి 25: పంట పొలాలకు పురుగుమందులను పిచికారీ చేసే సమయంలో రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో అప్పసాని వెంకటరాజేష్ తెలిపారు. కరప, పెనుగుదురు, కొరుపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి రబీ పంటకు ఆశించే తెగుళ్ల, రసాయనిక మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటపై అద్దె పురుగు ఆశించిందని, అలాగే జింకుదాతు లోపం కనిపిస్తుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకోవాలని, కళ్లకు అద్దాలు పెట్టుకోవాలని, మద్యం, చుట్ట, బీడీ, సిగరెట్ తాగరాదన్నారు. గాలివాటానికి ఎదురుగా పిచికారీ చేయరాదని, వదులుగా ఉండే దుస్తులు ధరించాలన్నారు. ఖాళీ మందు డబ్బాలు, కవర్లు భూమిలో పాతిపెట్టాలని, పిచికారీ పూర్తయిన పిదప సబ్బుతో కాళ్లు, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కోవాలన్నారు. మందు ప్రభావానికి లోనై అపస్మారక స్థితికి చేరితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. వీఏఏ ప్రశాంత్ పాల్గొన్నారు.

'ప్రధాని మోదీకి మరో అవకాశం ఇవ్వాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25: ప్రధాని నరేంద్రమోదీకి మరో అవకాశం ఇవ్వాలని పలువురు బీజేపీ నాయకులు కోరారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, పి.ధర్మవరం గ్రామాల్లో ఆదివారం వారు ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆయన రాబోయే ఎన్నికల్లో మరోసారి విజయం సాధించేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, దేవర రామకృష్ణయాదవ్, గున్నాబత్తుల రాజబాబు, చింతాకుల రామకృష్ణ, మడికి కృష్ణ, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి అబ్బిరెడ్డి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'పవన్ కల్యాణ్ భరోసా కల్పిస్తేనే కొనసాగుతాం'

పెద్దాపురం, ఫిబ్రవరి 25: జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ కార్యకర్తలకు భరోసా కల్పిస్తే పార్టీలో కొనసాగుతామని పెద్దాపురం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండలంలోని పులిమేరులో ఆదివారం జనసైనికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా నిమ్మకాయల చినరాజప్ప పేరును టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యానన్నారు. తనకు, జనసైనికులకు అధినేత పవన్ కల్యాణ్ భరోసా కల్పించాలని, పార్టీ అధిష్టానం ఇచ్చే హామీని బట్టి తన భవిష్యత్తును నిర్ణయించుకుంటానన్నారు.

'మధుమేహ వ్యాధి అదుపుపై దృష్టి పెట్టాలి'

కాకినాడరూరల్, ఫిబ్రవరి 25: మధుమేహ వ్యాధి అదుపుపై లయన్స్‌క్లబ్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని లయన్స్ జిల్లాగవర్నర్ వేలూరి సూర్యనారాయణ తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, లయన్స్ జిల్లా 316బి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబోయే డయాబెటిక్ స్క్రీనింగ్, అవగాహనా కార్యక్రమాన్ని కాకినాడ లయన్స్‌క్లబ్‌హాల్లో సూర్యనారాయణ ప్రారంభించారు. అధ్యక్షత వహించిన ప్రాజెక్టు సమన్వయకర్త, లయన్స్ పూర్వపుజిల్లా గవర్నర్ డాక్టర్ బాదంబాలకృష్ణ మాట్లాడుతూ మొత్తం రూ.1కోటి 30లక్షలతో చేపడుతున్న ఈకార్యక్రమంలో భాగంగా రూ.43లక్షల నిధులతో 2వ విడత కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. అనిల్‌కుమార్, ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

'రజకులను ప్రభుత్వం ఆదుకోవాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25: రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వ రజక సేవా సంఘం విజ్ఞప్తి చేసింది. స్థానిక నరేంద్రగిరి కొండ సమీపంలోని మామిడితోటలో ఆదివారం రజక సంఘ సమావేశం నిర్వహించారు. రజక సంఘం నేతలు మాట్లాడుతూ వెనుకబడిన రజక వృత్తిదారులకు ప్రభుత్వ రుణాలు, పనిముట్లు, కమ్యూనిటీ భవనాలు వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. గౌరీశంకర రజక సంఘం నిర్వహించిన బల్లల పండుగలో గౌరీశంకర్లకు రజకులు ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

నాయకంపల్లిలో ప్రత్యేక హోమాలు

గండేపల్లి, ఫిబ్రవరి 25: మండలంలో నాయకంపల్లిలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా తత్వం చారిటబుల్ ట్రస్టు బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ నేతృత్వంలో లక్ష్మిగణపతి దుర్గ, శౌర్య, శతరుద్ర పారాయణం, రుద్ర హోమం, నవగ్రహ హోమం, నక్షత్రహోమం హోమాలను వేదపండితులు పూర్తి చేసి పూర్ణాహుతి గావించారు. భవానీ శంకర్ శర్మ, దక్షిణామూర్తి, తరుణ్, ఇత్యాధి వేద పండితుల సమక్షంలో ఈ పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ నాగ సత్యప్రభాకర్ చైత్ర దంపతులు, తెలంగాణ బీజేపీ కార్యవర్గ సభ్యురాలు గీతామూర్తి, భీమ్‌సేన్‌మూర్తి దంపతులు, ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పి.నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన శివ పంచయాన క్షేత్ర శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఆయనకు శృంగేరి పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి విధి సేకర భారతి సన్నిధాన స్వాములు ఆశీర్వదాలు అందించారు.

మహా రుద్రాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

జగ్గంపేట, ఫిబ్రవరి 25: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు నిర్వహించే కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడబాల భాస్కరరావు, కుంచే రామకృష్ణ, వెలమాటి కాశి, చాగంటి వీర వెంకట సత్యనారాయణ, బోదిరెడ్డి సుబ్బారావు, ఇప్పర్ల బాబి, అన్నవరం రాము, మేడిశెట్టి నారాయణరావు పాల్గొన్నారు. ఇర్రిపాకలో చేపట్టే కోటి పార్థివ లింగ మహారుద్రాభిషేకానికి ప్రసాద వితరణ కోసం జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి, గోకవరం మాజీ సర్పంచ్ బత్తుల శ్రీలక్ష్మి సత్తిబాబు టన్ను బియ్యం అందజేశారు.

చికిత్స పొందుతూ ఎంపీటీసీ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆరోపణ

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 25: అనారోగ్యానికి గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మహిళా ఎంపీటీసీ ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. ఆమె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువులు ఆరోపించారు. వివరాలిలా ఉన్నాయి. కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన బొడ్డేటి లక్ష్మి (45) స్థానిక ఎంపీటీసీగా వ్యవహరించేవారు. ఆమె కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతోంది. తొలుత కుటుంబీకులు ఆమెను ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచిన మేరకు మెరుగైన వైద్యనిమిత్తం లక్ష్మిని ఆమె కుమారుడు అప్పారావు శనివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌కు తరలించాడు. అక్కడ ఓల్డ్‌ఎస్ఎస్ఆర్ వార్డులో చికిత్స పొందుతున్న లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందింది. తన తల్లి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని అప్పారావు ఆరోపించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: కాకినాడ వికాస కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో డిగ్రీ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు స్త్రీపురుష అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.10వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్ భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల ఆధారంగా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376333లో సంప్రదించాలన్నారు.

నేడు 'స్పందన, డయల్ యువర్ కమిషనర్'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 25: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం నెంబరు 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చని,10.30గంటల నుంచి స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, ముఖ్య గమనిక, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, అంబాజీపేట మ్యారేజిబ్యాండు, రాజధాని ఫైల్స్, గుంటూరు కారం

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, రాజధాని ఫైల్స్, ఈగల్, ఊరుపేరు భైరవకోన, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా

తిరుమల: సూర్యపుసన్‌ఆఫ్‌కృష్ణన్, అంబాజీపేట మ్యారేజీబ్యాండు

లక్ష్మి	:	ఒక్కడు
సీ అండ్‌సీ1	:	సిద్ధార్థరాయ్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	ఊరు పేరు భైరవకోన
పద్మప్రియ	:	సుందరంమాస్టర్
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	సిద్ధార్థరాయ్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

నెహ్రూకు సత్కారం

జగ్గంపేట, ఫిబ్రవరి 25: జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను జనసేన నేతలు ఘనంగా సత్కరించారు. కాట్రావులపల్లి నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ఇర్రిపాక చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న కోటి పార్థివలింగ రుద్రాభిషేకానికి భక్తుల ప్రసాద వితరణ కోసం 80 టన్నుల బియ్యాన్ని అందించారు. సుంకర సీతారామయ్య, కంటే రామారావు, వెన్న వీర బాబు, కట్టు అబ్బులు, ఏలేటి పెద్ద బాబు, బీక్కన బాబి తదితరులున్నారు.

జగన్ పరిపాలనలో తీవ్ర నష్టం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

» వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

సామర్లకోట, ఫిబ్రవరి 25: ఐదేళ్ల జగన్ పరిపాలనలో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని, ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజలు బ్రతకడమే దుర్భరంగా మారుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం గ్రామ దళిత కొత్తూరు గ్రామంలో సుమారు 100 మంది కార్యకర్తలు ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. పార్టీ మండలా ధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, కుర్రా నారాయణ స్వామి(రాజు), సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజప్ప హాజరై నూతనంగా పార్టీలో చేరిన 100మంది కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా రాజప్ప విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌కు పరిపాలన చేతకాకు మోయలేనన్ని అప్పులు చేసి రాష్ట్ర భవితవ్యాన్ని తాకట్టు పెట్టారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన సమయంలో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు సమర్థవంతంగా నడిపించారన్నారు. నేడు అప్పుల ఊబిలో కూరుకుని, రాష్ట్ర అభివృద్ధి అగమ్యగోచరంగా ఉన్న విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ విజయం చారిత్రక అవసరం అన్నారు. పార్టీలోకి చేరిన దళితుల్లో బూలా నాగమణి, బురడా అచించబాబు, డోలా నానిబాబు, చెల్లె బలరాముడు, చింతల రాజు, గుడాల సుబ్బారావు, నాతి నాగేశ్వర రావు, రొక్కల అబ్బు, నేతల వీరబాబు, డోలా సతీష్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడ్డాల వెంకన్నబాబు, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, ముమ్మిడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట : టీడీపీలో చేరినవారితో రాజప్ప

ఇర్రిపాకలో....

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని ఇర్రిపాక గ్రామంలో ఏటివార రామాలయం వద్ద మాగాపు ఆంజనేయులు, కేసినేడి బుజ్జి, సోమిశెట్టి భగవాన్, కేశినేడి శ్రీను, కేసినేడి పెద్దకాపు, కేశినేడి వీరబాబు, కంబాల నూకరాజు, కంబాల నాగేశ్వరరావు, అడ్డాల వీరబాబు, లావేటి ంరామచంద్ర, అడ్డాల రాము, కేశినేని నాగేశ్వరరావు తదితర 25 కుటుంబాల వారు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నెహ్రూ మాట్లాడుతూ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో జగ్గంపేట ఎమ్మెల్యేగా తాను గెలుపొందడానికి ఈ చేరికలే బాటని అన్నారు. కార్యక్రమంలో పోతుల మోహన్‌రావు, కుంచే రామకృష్ణ, జ్యోతుల సత్యమూర్తి, పంతం తమ్మిరాజుబాబు, జ్యోతుల బాబ్జి, పప్పల నూకరాజు, మాగాపు శ్రీను, మేడిశెట్టి లావరాజు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25: టీడీపీ, జనసేనతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. స్థానిక తోటవీధిలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి శంఖవరం మండలం ఎస్. జగ్గంపేటకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. సీనియర్ టీడీపీ నేత డాక్టర్ ఓలేటి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో వైరా సత్యనారాయణ, శ్రీను, వీర మల్లేశ్వరరావు, కొరుప్రోలు కుషరాజు, ముగలపల్లి శ్రీను, మట్ల చిన బాబు, రాయుడు, వైరా బాబులు, చంటి, గణేష్‌కు సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మరో 2 నెలల్లో జనసేన, టీడీపీ కలయికతో నూతన ప్రభుత్వం ఏర్పడబోతుందని.. తమ ప్రభుత్వంలో గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాలరాజు), బద్ది రామారావు, వెన్నా శివ, పర్వత సురేష్, కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేట రూరల్: టీడీపీలో చేరినవారితో నెహ్రూ



ప్రత్తిపాడు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ తుని ఇన్‌చార్జి యనమల దివ్య



కోటనందూరు : ప్రచారం చేస్తున్న దివ్య

కోటనందూరు, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. ఆదివారం ఎస్అర్‌పేట గ్రామంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమం టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ వైసీపీ పాలనంతా దాచుకోవడం దోచుకోవడంగా తయారైయిందన్నారు. తుని నియోజకవర్గంలో గెలిచి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. తన తండ్రిని ఆదరించినట్టే తనని కూడ ఆదరించాలని కోరారు. నియోజకవర్గంలో అన్నిసమస్యలు పరిష్కరించి అభివృద్ధి పథకంలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో యనమల శివరామకృష్ణన్, మోతుకూరి వెంకటేష్, డి.చిరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, అంకంరెడ్డి నానబ్బాయి, పోతల సూరిబాబు, సుర్ల సూరిబాబు, గుడివాడ తాతబాబు, గుడివాడ రాజు, లెక్కల భాస్కర్, బంటుపల్లి వెంకటేశ్వరరావు, షేక్‌నవాబ్‌జానీ తదితరులున్నారు.

రాజుపేటలో ప్రచారం...

తుని రూరల్, ఫిబ్రవరి 25: జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. మండలంలోని రాజుపేట గ్రామంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలు అందజేసి రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించి ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని దివ్య కోరారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్, కొచ్చెర్లపాటి అరవింద వర్మ, ఆవుగడ్డి వెంకటరమణ, చింతమనీడి నాగ సోమరాజు, కిల్లాడ అప్పారావు, పకుర్తి శ్రీను, గొల్లపల్లి రాంబాబు, గజ్జి రాంబాబు, గింజాల అప్పారావు, కిల్లాడి సత్యనారాయణ ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

డీఎంహెచ్‌వో నరసింహనాయక్



గండేపల్లిలో రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

గండేపల్లి, ఫిబ్రవరి 25: వైద్య నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ ఆదేశించారు. ఆయన ఆదివారం గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల నుంచి వసతి, వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఓపీ సేవలు, లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఫార్మసీ సేవలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, అంకిత భావంతో పని చేయాలన్నారు. డాక్టర్ సురేంద్ర, రుతమ్మ, చల్లారావు, ఈశ్వరమ్మ, హిమావతి, సౌజన్య, నాగార్జున, దేవి, ఉపేంద్ర, రాజు, సిబ్బంది ఉన్నారు.

రాజపూడిలో పరిశీలన

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 25: జగ్గంపేట మండలంలోని రాజపూడి ప్రాథమిక కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజపూడి ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఆసుపత్రి నుంచి చేస్తున్న కార్యక్రమాలను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూజాను అడిగి తెలుసుకున్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో ఉన్న మందులను, లేబర్ రూమ్, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్లు,ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పూలే కాలనీలో పాకల కూల్చివేతపై దుమారం

మాజీ ఎమ్మెల్యే కొండబాబు మండిపాటు



కొండబాబు వద్ద వాపోతున్న కాలనీవాసులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: ఎన్నో దశాబ్దాలుగా స్థానిక పర్లోవపేట శివారు పూలే కాలనీలో నివాసం ఉంటున్న పేదల పాకలు కూల్చివేతపై దుమారం రేగింది. తమ పాకలను కూల్చివేసి వేరే వారికి స్థలాలను అప్పగిస్తున్న వ్యక్తులను పాకలవాసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొండబాబు అక్కడకు చేరుకుని పూలేకాలనీవాసులతో మాట్లాడారు. గతంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తాము సర్వం కోల్పోయామని, అగ్నిప్రమాద బాధితుల జాబితాలో తమ పేర్లు నమోదు చేసి పునరావాస స్లిప్‌లు ఇచ్చారని బాధిత మహిళలు వాపోయారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గతంలో పూలే కాలనీ పేదలకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని, ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. పూలే కాలనీలో పేదల స్థలాలపై జరుగుతున్న దౌర్జన్యం, అన్యాయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు తుమ్మల రమేష్, తుమ్మల సునీత, వొమ్మి బాలాజీ, గంపల లక్ష్మణరావు, కడలి వెంకటరమణ, తుమ్మల కొండలరావు, ఎన్.లోవలక్ష్మి, ఆదిలక్ష్మి ఉన్నారు.

యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం

శంఖవరం, ఫిబ్రవరి 25: యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరమని వైద్యుడు, రోటరీ చైర్మెన్ ఎస్.రామకృష్ణ అన్నారు. కత్తిపూడి యువత ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చెయ్యడానికి ముందుకురావడం శుభపరిణామమని అన్నారు. శిబిరం ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన యాగా వీరబాబుని అభినందించారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, ఎన్.ఉదయభాను, టీపీఎస్ఎన్.ప్రసాద్, పి.సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి ప్రసాద్, సాదనాల లక్ష్మీబాబు, కంచిబోయిన శ్రీను, నాయుడు బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.



కత్తిపూడిలో రక్తదానం చేస్తున్న యువత

చేబ్రోలులో పేలిన గ్యాస్ సిలిండర్

దెబ్బతిన్న వస్తువులు



దెబ్బతిన్న వస్తువులు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 25: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఒక ఇంటిలో సిలిండర్ పేలింది. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు దెబ్బతినగా వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. గ్రామానికి చెందిన కొత్తపేటలో గల పేపకాయల రామకృష్ణ ఇంటిలో ఆదివారం ఉదయం గ్యాస్ సిలిండర్ మార్చి కొత్తది పెట్టారు. స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఇంట్లో ఉన్నవారంతా భయాందోళనలకు గురై బయటకు వచ్చేశారు. అనంతరం సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. ఆ తాకిడికి ఇంటి గుమ్మం ఊడిపోగా తలుపులు ఎగిరి దూరంగా పడ్డాయి. ఇంట్లోని వస్తువులు దెబ్బతిన్నాయి. మంటలు వస్తున్నప్పుడే ఇంట్లోని వారు బయటకు వచ్చేయడంతో పెనుప్రమాదం తప్పింది. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

'వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధం'



కాకినాడలో నినాదాలు చేస్తున్న జనసేన నేతలు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 25: స్థానిక 12వ డివిజన్ పర్లోపేట రామాలయం వద్ద జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో డివిజన్ అధ్యక్షుడు కాండ్రేగుల సతీష్ ఆధ్వర్యంలో చెత్త పన్ను నుంచి విముక్తికై యుద్ధానికి మేము సిద్ధం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు జనసేన సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సరగడ రమణారెడ్డి, కుందు సతీష్, ఎస్‌కే జాఫర్, పొట్టి సతీష్, పొట్టి ఇంద్ర,చంతపల్లి రాము ఉన్నారు.

టీడీపీ, జనసేన నేతల బైక్ ర్యాలీ



తాళ్లరేవు, ఫిబ్రవరి 25: జి.వేమవరం, చొల్లంగి, చొల్లంగిపేట టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, గండి అప్పారావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును కలిసేందుకు చొల్లంగి నుంచి బైక్‌ర్యాలీగా మురమళ్ల వెళ్లారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 25: గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. గొల్లప్రోలు మాధురి విద్యాలయ, చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగిన పరీక్షలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు తరలివచ్చారు. మాధురి విద్యాలయలోని పరీక్షా కేంద్రంలో 750మంది విద్యార్థులకు గాను 687మంది హాజరు కాగా 63మంది హాజరు కాలేదు. ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 900మంది అభ్యర్థులకు 804మంది మాత్రమే హాజరు కాగా 96మంది హాజరు కాలేదు. పరీక్షలను పోలీసు,రెవిన్యూ అధికారులు పర్యవేక్షించారు.

పిఠాపురం: పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. 300మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 245మంది హాజరయ్యారు. పరీక్షల తీరును తహశీల్దారు కాళి లక్ష్మి పర్యవేక్షించారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో గ్రూప్2 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు క్యాంపస్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పరీక్షలకు 4676 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 4051 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని పెద్దాపురం డీఎస్పీ లలితాకుమారి, సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ పరిశీలించారు.

కోటనందూరు: కోటనందూరు మదర్ విద్యాసంస్థలో గ్రూప్2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 202మంది పరీక్షకు హాజరయ్యారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శంకరావు, తహశీల్దార్ విజయరామరాజు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామని ప్రిన్సిపాల్ రాజు తెలిపారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం



ప్రత్యేక అలంకరణలో కేశవ, పట్టాభిరామస్వామి

పెద్దాపురం, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో ఉన్న కేశవ, పట్టాభిరామ స్వామివారి శ్రీపుష్పోత్సవ కార్యక్రమం ఆదివారం ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పుష్పోత్సవ కార్యక్రమం సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టువస్త్రాలతో స్వామివారిని అలంకరించారు. అలాగే భక్తులు స్వామి వారికి పూలు, పండ్లు సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ

కరప, ఫిబ్రవరి 25: గురజానాపల్లిలోని మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థకు రూ.10వేలు విలువచేసే 4 సీలింగ్ ఫ్యాన్లు వితరణగా లభించాయి. పెనుగుదురు మాజీ సర్పంచ్ కొమ్మోజు శ్రీదేవి శ్రీనివాస్‌ల కుమారుడు యోగా ఈ ఫ్యాన్లను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజుకు అందజేశారు. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, బీవోబీ కరప బ్రాంచ్ ఉద్యోగి చోడపునీడి చంటి తదితరులున్నారు.

బాడీ బిల్డింగ్‌లో గోల్డ్ మెడల్

గండేపల్లి, ఫిబ్రవరి 25: సూరంపాలెంలో ఆదిత్య విద్యార్థి ఎన్.రోహిత్ బాడీ బిల్డింగ్ 75కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 23,24న కేరళలో నిర్వహించిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ బెస్ట్ ఫిజిక్ చాంపియన్‌షిప్ 2024లో ఆదిత్యలో సివిల్ విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న రోహిత్ గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు. రోహిత్‌కు కళాశాల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, సాయికిషోర్ పలువురు అభినందనలు తెలిపారు.

సచివాలయం ప్రారంభం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 25: మండలంలోని పేరవరం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచ్ బి.సూర్య వరలక్ష్మీ, జడ్పీటీసీ నీరుకొండ రామకుమారిలతో కలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణ చంద్రప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో అంబేడ్కర్ విగ్రహ పరిసర ప్రాంతాలను సుందరీకరణ పనులను ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో బి.అర విండ్, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలంపాట

తాళ్లరేవు, ఫిబ్రవరి 25: తాళ్లరేవు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో పట్టుబడిన 6 ద్విచక్రవాహనాలకు ఈనెల 28న ఉదయం 11గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్టు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణదాస్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచినవారు దరావత్తును చెల్లించి పాటలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు తాళ్లరేవు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

రౌతులపూడి, ఫిబ్రవరి 25: మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్‌పట్నం, వెంకటనగరం, బిబిపట్నం గ్రామాల్లో ఇంటింటా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు యనుముల నరసింహమూర్తి దొర ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ ఉమ్మడి వెంకట్రావు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. కోల్లు వీరగణేష్, గుర్రం విష్ణు, పెదబాబు, కుసరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

తుని రూరల్, ఫిబ్రవరి 25: స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని సీఎంఆర్ సెంటర్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

తుని బీఎస్పీ ఇన్‌చార్జిగా కిరణ్

తుని రూరల్, ఫిబ్రవరి 25: బహుజన సమాజ్ పార్టీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా హంసవరం గ్రామానికి చెందిన దళిత నేత తంతటి కిరణ్‌కుమార్ నియామకం జరిగింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షురాలు బి.పరంజ్యోతి చేతులమీదుగా నియామకపత్రం తీసుకున్నట్టు కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహిస్తామన్నారు.

ఆమ్ ఆద్మీ ఇన్‌చార్జి నియామకం

తుని రూరల్, ఫిబ్రవరి 25: ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ సమావేశం తునిలో జరిగింది. పార్టీ కన్వీనర్ నరాల శివ హాజరై తుని నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌చార్జిగా తునికి చెందిన పి.లక్ష్మణాచార్యులను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కృష్ణమోహన్, జిల్లా ట్రెజరర్ ఎస్‌వీఎస్ రామారావు, ఆ పార్టీ నేతలు మూర్తి, జానకి రామయ్య, కామేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

తుని రూరల్, ఫిబ్రవరి 25: వరకట్నం వేధింపులపై తుని పట్టణానికి చెందిన మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ తెలిపారు. ఆలమూరుకు చెందిన రవికుమార్‌తో 2019లో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలుండగా అత్తమామలతో పాటుగా ఆడపడుచు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు అందగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.